## ఒక అపోహ:

దైవప్రవక్త సమాధి జీవితం ప్రాపంచిక జీవితం లాంటిదని రుజువు చేయటానికి కొందరు ఈ క్రింది హదీసులు నిదర్శనంగా చూపిస్తారు.

1) ఎవరైనా నాకు సలాం చేస్తే అల్లాహ్ నా ఆత్మను (తిరిగి శరీరంలోకి) పంపుతాడు. దాంతో నేను అతనికి ప్రతి సలాం చేస్తాను. (అబూదావూద్)

2) నా కొరకు అతి ఎక్కువగా దరూద్ పఠించండి. అల్లాహ్ నా సమాధి దగ్గర ఒక దూతను నియమిస్తాడు. నా అనుచర సమాజంలో ఎవరైనా నా కొరకు దరూద్ పఠిస్తే అప్పుడు ఆ దూత నాతో "ముహమ్మద్! ఫలానా అతని కుమారుడు ఫలానా మనిషి, ఫలానా సమయంలో మీ కొరకు దరూద్ పఠించాడు" అని చెబుతాడు. (దైలమీ).

3) జుమారోజు అత్యధికంగా నా కొరకు దరూద్ పఠించండి. జుమారోజు నా కొరకు పఠించబడిన దరూద్ నా ముందు సమర్పించబడుతుంది. (హాకిమ్, బైహఖీ)

షైఖ్ ముహమ్మద్ నాసిరుద్దీన్ అల్‌బానీ (రహ్మలై) మొదటి రెండు హదీసులను హసన్‌గానూ, మూడో హదీసును సహీహ్‌గానూ పేర్కొన్నారు. ఈ హదీసుల ద్వారా "దైవప్రవక్త జీవితం"ను రుజువు చేయాలని ప్రయత్నించేవారు కూడా మేము ఇంతకు ముందు "సమాధి జీవితం ఎలా ఉంటుంది?" అనే శీర్షిక క్రింద ప్రస్తావించిన అపోహకే లోనై ఉన్నారు. దైవప్రవక్త (సల్లం) సమాధిలో ఇతర దైవప్రవక్తలు, వలీలు, అమరగతులకంటే ఉన్నతమైన, పరిపూర్ణమైన జీవితం గడుపుతున్న మాట నిజమే. దాన్ని నిరాకరించటానికి వీలులేదు. కాని సమాధి జీవితం ఇహలోక జీవితానికి పూర్తిగా భిన్నమైనది కనుక దాన్ని ఈ ప్రాపంచిక జీవితంతో పోల్చటం శుద్ధ తప్పు. మనిషికి ఈ ప్రపంచంలో ఉండి సమాధిలోక జీవిత వ్యవహారాలను అర్థం చేసుకునే తెలివి, అవగాహన ఇవ్వబడలేదు. (బఖర సూరా 154వ సూక్తి చూడండి).

https://teluguislam.net


మీరే ఆలోచించండి! ప్రజల సలాముకు జవాబు చెప్పటం కోసం ఆయన ఆత్మను అయన పవిత్ర దేహంలోకి పంపించటం అనేక విధాలుగా జరగవచ్చు. ఉదా: ప్రతి వ్యక్తి సలాం చేసినప్పుడల్లా ఆయన ఆత్మను దేహంలోకి పంపించవచ్చు, లేక రోజుకి ఒకసారి ఏదైనా సమయంలో పంపించవచ్చు లేక వారానికి ఒకసారి లేదా నెలకు ఒకసారి లేక సంవత్సరంలో ఒకసారి ప్రజలందరి సలాములు కలిపి ఆయనకు చేరవేస్తే ఆయన వాటన్నిటికి ఒకేసారి ప్రతి సలామ్ చెప్పవచ్చు. ఆత్మ శరీరంలోకి పంపించటం పైన పేర్కొనబడిన విధాల్లో ఏదో ఒక విధంగా జరగవచ్చు లేక మరేదయినా కొత్తవిధంగా జరగవచ్చు. దాని వాస్తవస్థితి అల్లాహ్‌కు మాత్రమే తెలుసు. దరూదె షరీఫ్ సంగతి కూడా అంతే. అవి దైవప్రవక్తకు రోజూ చేరవేయబడతాయా లేక ఆయన ప్రవచించినట్లు జుమారోజు చేరవేయబడతాయా? నిజం చెప్పాలంటే అల్లాహ్‌కు తప్ప మరెవరికీ తెలియని విషయాలివి. మనం వాటిని విశ్వసించటం విధి. కాని వాటి స్థితిని అర్థం చేసుకోవటం మనకు అసాధ్యం. అసలు మనకు దాని అవసరం కూడా లేదు. ఒక విషయాన్ని విశ్వసించటం దాని స్థితిని అర్థం చేసుకోవటంతో ముడిపడిలేదు. ఎన్నో విషయాలమీద మనకు విశ్వాసం ఉంది. కాని ఇహలోక జీవితంలో మనం వాటి స్థితిని అర్థం చేసుకోలేం. ఉదా: రాత్రి చివరి భాగంలో అల్లాహ్ మొదటి ఆకాశంపైకి అవతరిస్తాడని మనకు నమ్మకం ఉంది కాని అది ఎలా జరుగుతుందో మనకు తెలియదు. కిరామన్ కాతిబీన్ దూతలు కర్మల చిట్టాను తయారుచేస్తారని నమ్ముతాం. కాని అది ఎలా జరుగుతుందో మనకు తెలియదు. ప్రళయదినాన కర్మలు తూయబడతాయన్న విషయాన్ని మనం నమ్ముతాం. కాని అది ఎలా జరుగుతుందో తెలీదు. దైవప్రవక్త మేరాజ్ (గగనయానం) చేశారని నమ్ముతాం. కాని అది ఎలా జరిగిందో మనకు తెలియదు. ఇలాంటి ఉదాహరణలు కొన్ని కాదు వందలకొలది ఇవ్వొచ్చు. వాటిని మనం విశ్వసిస్తాం కాని వాటి స్థితి గురించి మనకు తెలియదు. సమాధి జీవితంలో దైవప్రవక్త ఆత్మ శరీరంలోకి పంపించబడటం, ఆయన ప్రజల సలాముకు ప్రతి సలాం చెప్పటం, దూతలు ఆయనకు దరూద్ చేరవేయటం, జుమారోజు ఆయన ముందు దరూద్‌లు సమర్పించబడటం. ఇవన్నీ కూడా ఆ కోవకు చెందినవే. అంటే వాటి స్థితిని, వాస్తవికతను అర్థం చేసుకోవటం మనకు అసాధ్యం. కాని వాటిని విశ్వసించటం మాత్రం విధి. కనుక పై హదీసుల ద్వారా దైవప్రవక్త (సల్లం) సమాధిలో బతికున్నారనీ రుజువు కాదు, అలాగే ఆ హదీసులను నిదర్శనంగా చేసుకొని ఆయన మన సలాం వింటారు, దానికి ప్రతిసలాం చెబుతారు, కనుక మన ఇతర విన్నపాలు, వినతులు, మొరలు దుఆలు కూడా వింటారు, దానికి సమాధానం పలుకుతారు, మన అవసరాలు తీరుస్తారు, మన మన్నింపు కోసం ప్రార్థిస్తారు లేక సమాధి నుంచి బయటికి విచ్చేసి ఔలియాలతో సమావేశాలు ఏర్పాటు చేస్తారని చెప్పటమూ సరికాదు. ఇవన్నీ తప్పుడు ఊహాగానాలు. జనాన్ని భ్రష్టుపట్టించేవి. గ్రంథం, సున్నతుల బోధనలతో

https://teluguislam.net



వీటికి ఏ మాత్రం సంబంధం లేదు. దేవుడు ఆయన ప్రవక్త ఎంతవరకయితే చెప్పారో అంతవరకు నిస్సంకోచంగా చెప్పాలి. దాన్ని విశ్వసించాలి. ఏ విషయమైతే దేవుడు, దైవప్రవక్త చెప్పలేదో దాన్ని స్వంతంగా ఊహించుకొని ఆ తర్వాత అది దేవుని, దైవప్రవక్త మాట అని చెప్పకుండా ఉండేందుకు వెయ్యిసార్లు శరణువేడుకోవాలి. దైవప్రవక్త (సల్లం) ఇలా ప్రవచించారు:

"مَنْ كَذَبَ عَلَيَّ مُتَعَمِّدًا فَلْيَتَبَوَّأْ مَقْعَدَهُ مِنَ النَّارِ"

ఎవరయితే ఉద్దేశపూర్వకంగా నామీద అబద్ధాన్ని మోపుతాడో అతను తన నివాసాన్ని నరకంలో ఏర్పరచుకుంటాడు. (బుఖారీ-ముస్లిం)